నమస్తే తెలంగాణ
# మహబూబాబాద్
5 | సోమవారం 15 జూలై 2024 | MAHABUBABAD

## నేడు రైతు భరోసాపై వర్క్‌షాపు

హనుమకొండ, జూలై 14: రైతు భరోసా పథకం విధివిధానాలపై హనుమకొండ కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో సోమవారం ఉమ్మడి వరంగల్ జిల్లా వర్క్‌షాపు నిర్వహించనున్నట్లు కలెక్టర్ పీ ప్రావీణ్య ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 గంటలకు నిర్వహించే ఈ వర్క్‌షాపులో మంత్రివర్గ ఉప సంఘం చైర్మన్, ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టివిక్రమార్క, సభ్యులు రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వర్‌రావు, రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి శ్రీధర్‌బాబు, ఉమ్మడి వరంగల్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి, రాష్ట్ర రెవెన్యూ, సమాచార పౌర సంబంధాల శాఖల మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి, అటవీ పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ, పంచాయతీ రాజ్, గ్రామీణాభివృద్ధి, స్త్రీ, శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ (సీతక్క) పాల్గొననున్నట్లు పేర్కొన్నారు. రైతు భరోసా విధివిధానాలపై రైతులు, రైతు సంఘాలు, ప్రజాప్రతినిధులు, ఇతర వర్గాల నుంచి మంత్రివర్గ ఉప సంఘం అభిప్రాయాలను సేకరించనున్నట్లు వివరించారు.



శాకంబరీ నవరాత్రుల తొమ్మిదో రోజు ఉగ్రప్రభా మాతగా అమ్మవారు

## ఉగ్రప్రభా మాతగా భద్రకాళీ

వరంగల్, జూలై 14: భద్రకాళీ శాకంబరీ నవరాత్రోత్సవాలు వైభవంగా జరుగుతున్నాయి. తొమ్మిదో రోజు ఆదివారం కాళీ క్రమాన్ని అనుసరించి అమ్మవారిని ఉగ్రప్రభా మాతగా అలంకరించారు. ఉదయం నిత్యాహ్నికం పూర్తి చేసి, ఉగ్రప్రభా మాత, సాయంత్రం త్వరితా మాతగా అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో దర్శించుకొని మొక్కులు చెల్లించుకున్నారు.

### తలచుకుంటేనే భయమేస్తుంది..



ఆ రోజు రాత్రి ఒక్కసారిగా ఇండ్లలోకి నీళ్లు రావడం.. ప్రాణాలు కాపాడుకోవడానికి ఇండ్లపైకి ఎక్కడం అదంతా తలుచుకుంటేనే భయమేస్తున్నది. గతంలో ఒకసారి అలాగే వరద ప్రవాహం వచ్చింది. మళ్లీ గత ఏడాది వచ్చింది. మోరంచ వాగు ప్రవాహం ఎప్పుడు ఎలా వస్తుందో ఎవరూ ఊహించలేరు. అందుకే అధికారులు గ్రామానికి రక్షణ కల్పించాలి. వరద ప్రవాహం వచ్చే దిక్కులను గుర్తించి రింగ్ బండ్ కట్టించాలి. వర్షాలను దృష్టిలో ఉంచుకుని ఇప్పటి నుంచే అధికారులు అప్రమత్తం కావాలి.

– సండెసారి రాజేశ్వర్‌రావు, మోరంచపల్లి

### పది మీటర్ల ఎత్తుతో కరకట్ట నిర్మించాలి



మోరంచపల్లి గ్రామానికి గతేడాదిలాగే మళ్లీ మోరంచ వరదతో ముప్పు పొంచి ఉంది. గత వరదల్లో మా అత్త వజ్రమ్మ, మామ ఓది రెడ్డి ఇద్దరూ మృతి చెందారు. ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా చూడాలి. గ్రామ సమీపంలో లో లెవల్ నుంచి హై లెవల్ వరకు 500 మీటర్ల పొడవుతో పెద్ద బ్రిడ్జి నిర్మించాలి. అలాగే ఏటూరునాగారంలో నిర్మించిన విధంగా లక్ష్మారెడ్డిపల్లి నుంచి మోరంచపల్లి గ్రామం వరకు 10 మీటర్ల ఎత్తుతో కరకట్ట నిర్మించాలి. గ్రామస్తులకు డబుల్ బెడ్‌రూం ఇండ్లు నిర్మించి ఇవ్వాలి. జిల్లా కలెక్టర్ ఈ విషయమై ప్రత్యేక సమావేశం నిర్వహించి యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టాలి.

– ఉప్పుగళ్ల వేణుగోపాల్‌రెడ్డి, గ్రామస్తుడు



గతేడాది వచ్చిన వరదలకు నీట మునిగిన మోరంచపల్లి గ్రామం (ఫైల్)





# మోరంచపల్లి భద్రమేనా?

- గ్రామంలో భారీ ప్రాణ, ఆస్తి నష్టం
- ఇప్పటికీ భయం నుంచి తేరుకోని జనం
- వర్షాల ప్రారంభంతో భయాందోళన
- చెరువు కట్టల బలంపై అనుమానాలు
- వాతావరణ శాఖ ఎల్లో హెచ్చరిక జిల్లాల్లో భూపాలపల్లి..

### గతేడాది ఇదే నెలలో ఊరిని ముంచిన మోరంచ వాగు

జయశంకర్ భూపాలపల్లి, జూలై 14 (నమస్తే తెలంగాణ) : జూలై 27 ఆ గ్రామ ప్రజలు మరచిపోలేని రోజు. అర్ధరాత్రి గాఢ నిద్రలో ఉన్న సమయంలో జల ప్రళయం ముంచుకొచ్చింది. వారు తేరుకునే సమయానికి నీరు మంచాలు, బెడ్లపైకి చేరింది. ఎటు చూసినా సముద్రాన్ని తలపించేలా వరద. కరెంటు లేదు. అంతా చీకటిమయం. ఏం జరుగుతుందో తెలియని పరిస్థితి. ప్రాణాలు కాపాడుకునేందుకు పిల్లా పాపలతో ఇండ్లపైకి చేరుకున్నారు. పరిస్థితిని గమనించి కొందరు అధికారులకు సమాచారమిచ్చారు. వారు వచ్చినా వరద ఉధృతికి ఏమీ చేయలేకపోయారు. పలు ఇండ్లు కూలిపోగా, మరికొన్ని శిథిలమయ్యాయి. గొర్రె ఓదిరెడ్డి, గొర్రె వజ్రమ్మ, గంగిడి సరోజన, గడ్డం మహాలక్ష్మి వరదల్లో కొట్టుకుపోయారు. 200కు పైగా పశువులు మృత్యువాత పడ్డాయి. ఇదీ ఆ రోజు మోరంచ వాగు ప్రవాహంలో చిక్కుకున్న గ్రామస్తుల పరిస్థితి. ఈ ఘటన జరిగి ఏడాది గడుస్తున్నా ఆ భయం నుంచి ఇంకా తేరుకోవడం లేదు. మళ్లీ వర్షాకాలం ప్రారంభమవడం, వాతావరణ శాఖ అధికారులు ఎల్లో హెచ్చరిక జిల్లాల్లో భూపాలపల్లిని చేర్చడంతో గ్రామస్తులు గత ఏడాది జలప్రళయాన్ని గుర్తు చేసుకొని ఆందోళన చెందుతున్నారు.

**రింగ్ బండ్ ఏర్పాటు చేయాలి..**

విపత్తులు అనుకోకుండా వస్తాయనేది గతేడాది మోరంచపల్లి గ్రామానికి నేర్పిన పాఠం. ఎప్పుడో పూర్వం వచ్చిన పెద్ద వరద గతేడాది మరోసారి కళ్లముందు నిలిచింది. మళ్లీ వర్షాలు ప్రారంభమవుతున్న నేపథ్యంలో గ్రామస్తులు గత చేదు అనుభవాన్ని గుర్తు చేసుకుంటున్నారు. మోరంచతో ఎప్పుడు ఎలాంటి ప్రమాదం ముంచుకొస్తుందో అని భయాందోళనలకు గురవుతున్నారు. అధికార యంత్రాంగం గతేడాది జలప్రళయాన్ని దృష్టిలో పెట్టుకుని ముందస్తు చర్యలు చేపట్టాలని కోరుతున్నారు. గ్రామంలోకి వరద నీరు రాకుండా రింగ్ బండ్ ఏర్పాటు చేయాలని, ఈ విషయమై కలెక్టర్ ప్రత్యేక సమావేశం నిర్వహించి ప్రణాళికలు తయారు చేయాలని వేడుకుంటున్నారు. అలాగే కుందయ్యపల్లి, మోరంచపల్లి గ్రామాల మధ్యలో ఉన్న లో లెవల్ కల్వర్టును హై లెవల్‌గా నిర్మించి నీరు సాఫీగా వెళ్లేలా చూడాలంటున్నారు.



### చెరువులు పదిలమేనా?

భారీ వర్షాలకు గతేడాది జూలై 27 తెల్లవారుజామున గణపసముద్రం మత్తడిపడింది. ధర్మారావుపేటలోని ఊర చెరువు, కర్కపల్లిలోని ఊడుగుల కుంట, వెంకటాపూర్‌లోని మారెడ్డి పేట చెరువు, కొత్తపల్లి దొమ్మటిపల్లి చెరువులు గండిపడి నీరు ఒక్కసారిగా బయటికి రావడంతో మోరంచ ప్రవాహం ఉగ్రరూపం దాల్చి మోరంచ గ్రామాన్ని ముంచేసింది. ప్రస్తుతం ఊర చెరువు రూ.2.25 కోట్లు, ఊడుగుల కుంట రూ.85 లక్షలు, దొమ్మటిపల్లి చెరువు రూ 2.67 కోట్లతో మరమ్మతు ప్రారంభించగా పనులు చివరి దశలో ఉన్నాయి. మారెడ్డిపేట చెరువు మరమ్మతుకు ఇంతవరకు నిధులు మంజూరు కాలేదు. అయితే మరమ్మతు చేసిన చెరువులు పదిలమేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్నాయి. ఈ వర్షాకాలంలో చెరువులు నిండితే తట్టుకోగలవా.. మళ్లీ గండిపడితే పరిస్థితి ఏంటనే ప్రశ్నలు తలెత్తుతున్నాయి. ఈ నాలుగు చెరువులు ఒక్కసారిగా తెగిపోవడం, వరద ఉధృతి ఎక్కువై మోరంచపల్లి గ్రామం మునిగింది. మళ్లీ అలాంటి పరిస్థితి తలెత్తకుండా చర్యలు చేపట్టాలని గ్రామస్తులు కోరుతున్నారు.

### కేసీఆర్ ప్రభుత్వం ప్రత్యేక చొరవ

మోరంచపల్లి గ్రామ పరిస్థితిని అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, జిల్లా కలెక్టర్ భవేశ్‌మిశ్రా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లారు. గ్రామానికి చెందిన సుమారు 900 మందిని గణపురం మండలం కర్కపల్లి పాఠశాల, గాంధీనగర్‌లోకి సీఎస్‌ఐ పాఠశాలకు తరలించారు. ఆహార ప్యాకెట్లు, వాటర్ బాటిళ్లు, ఓఆర్‌ఎస్ ప్యాకెట్లను అందించారు. అలాగే ప్రభుత్వం రెండు హెలికాప్టర్లను పంపించింది. ప్రాణ, ఆస్తి నష్టం పెరుగకుండా కాపాడారు. బాధితులకు ప్రభుత్వం, ఎమ్మెల్యే గండ్ర ఆర్థిక సాయం అందజేశారు. స్వచ్ఛంద సంస్థలు చేయూతనందించాయి.



సహాయక చర్యల్లో అప్పటి ఎమ్మెల్యే గండ్ర వెంకటరమణారెడ్డి, కలెక్టర్, ఎస్పీ (ఫైల్)

## ఎన్పీడీసీఎల్‌లో నూతన సాంకేతిక పద్ధతులు

**సీఎండీ వరుణ్‌రెడ్డి**

హనుమకొండ సబర్బన్, జూలై 14 : ఎన్పీడీసీఎల్ పరిధిలోని విద్యుత్ వినియోగదారులకు మెరుగైన, నాణ్యమైన విద్యుత్ అందించడానికి, అంతరాయాలను కనిష్ట స్థాయిలోకి తీసుకురావడానికి నూతన సాంకేతిక పద్ధతులకు శ్రీకారం చుట్టినట్లు సీఎండీ వరుణ్‌రెడ్డి తెలిపారు. ఇందులో భాగంగా ఎన్పీడీసీఎల్ పరిధిలో అసెట్ మ్యాపింగ్ ట్రాకింగ్‌లో అన్ని 33కేవీ, 11కేవీ స్తంభాలకు యూనిక్ పోల్ నంబర్ పెయింటింగ్ ప్రక్రియను ప్రారంభించామని పేర్కొన్నారు. అసెట్ మ్యాపింగ్ వల్ల పోల్‌ల వారీగా పెట్రోలింగ్ సులభంగా చేపట్టవచ్చని తెలిపారు. నిర్వహణను కూడా ట్రాక్ చేసే వీలుంటుందని పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల వైఫల్యాలు కూడా ట్రాక్ చేసుకునే సౌలభ్యం ఉంటుందని, ఎక్కడైనా సమస్య ఉత్పన్నమైతే వెంటనే ఆ పోల్ నంబర్ ద్వారా లొకేషన్ మ్యాపింగ్ తెలుసుకుని సమస్యను త్వరగా పరిష్కరించవచ్చని తెలిపారు. ఇప్పటి వరకు 1826 ఫీడర్లకు నంబరింగ్, డిజిటలైజేషన్, పీఎంఐ(ప్రీ మాన్సూన్ ఇన్‌స్పెక్షన్) పూర్తి చేసినట్లు వివరించారు. మిగతా ఫీడర్లలో రెండు నెలల్లో పూర్తి చేయడానికి ప్రణాళికలు సిద్ధం చేసుకున్నామని సీఎండీ తెలిపారు.



నారక్కపేటలో అశ్వారావుపేట ఎస్సై శ్రీనివాస్ కుటుంబానికి చెక్కు అందజేస్తున్న సివిల్ ఎస్సైస్ టీఎస్, ఏపీ వెల్ఫేర్ సొసైటీ బృందం

## ఎస్సై కుటుంబానికి బ్యాచ్‌మేట్స్ భరోసా

- నారక్కపేటలో శ్రీనివాస్ భార్యకు రూ.25లక్షల చెక్కు అందజేత

నల్లబెల్లి, జూలై 14 : ఇటీవల భద్రాద్రి కొత్తగూడెం జిల్లా అశ్వారావుపేట ఎస్సై శ్రీరాముల శ్రీనివాస్ ఆత్మహత్యా యత్నానికి పాల్పడి చికిత్స పొందుతూ ఈ నెల 7న మృతి చెందిన విషయం తెలిసిందే. కాగా, సివిల్ ఎస్సై టీఎస్, ఏపీ వెల్ఫేర్ బృందం ఆదివారం మండలంలోని నారక్కపేట గ్రామం చేరుకుని మృతుడి చిత్రపటం వద్ద నివాళులర్పించారు. బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. అనంతరం సొసైటీ అధ్యక్షుడు ఎస్సై శ్రీధర్ ఆధ్వర్యంలో మృతుడి భార్య కృష్ణవేణికి రూ.25లక్షల ఆర్థికసాయం అందించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 2014 ఎస్సై బ్యాచ్‌లో తెలంగాణ, ఆంధ్రప్రదేశ్ నుంచి 747 మంది ఉన్నామని, అందులో సభ్యుడైన ఎస్సై శ్రీనివాస్ మృతి తీరని లోటు అని అన్నారు. అతడి కుటుంబానికి జీవితాంతం సొసైటీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కార్యక్రమంలో ఎస్సైలు రామకృష్ణ, శ్రీనివాస్, రామారావు, పరమేశ్ పాల్గొన్నారు.

## జలకాలాడుతూ.. ఎంజాయ్ చేస్తూ..

**బొగత జలపాతానికి భారీగా పర్యాటకులు**

వాజేడు, జూలై 14 : మండలంలోని చీకుపల్లి అటవీ ప్రాంతంలో ఉన్న బొగత జలపాతాన్ని చూసేందుకు ఆదివారం పెద్ద ఎత్తున పర్యాటకులు తరలివచ్చారు. జలపాతం అందాలను వీక్షించి వ్యూ పాయింట్ వద్ద సెల్ఫీలు, ఫొటోలు దిగారు. జలపాతం ముందు భాగంలోని స్విమ్మింగ్ పూల్‌లో స్నానాలు చేస్తూ కేరింతలు కొడుతూ ఎంజాయ్ చేశారు.



జలపాతం స్విమ్మింగ్ పూల్‌లో స్నానాలు చేస్తున్న పర్యాటకులు


## ఆయిల్‌పామ్ రైతుల అభివృద్ధికి కృషి

**తెలంగాణ ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి**



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న రాఘవరెడ్డి

హనుమకొండ, జూలై 14 : ఆయిల్‌పామ్ రైతుల అభివృద్ధికి కృషి చేస్తానని తెలంగాణ ఆయిల్ సీడ్స్ గ్రోయర్స్ ఫెడరేషన్ చైర్మన్ జంగా రాఘవరెడ్డి అన్నారు. ఆదివారం మండలంలోని టేకులగూడెంలోని ఆయన నివాసంలో మాట్లాడుతూ.. ఆయిల్ పామ్ సాగు వరి కంటే లాభదాయకమని అన్నారు. ఎకరాకు రూ.1.50 లక్షల నుంచి 1.80 లక్షల వరకు ఆదాయం వస్తుందని తెలిపారు. రైతులకు రవాణా, స్టోరేజీ, మద్దతు ధర వచ్చేట్లు చూస్తామన్నారు. నాలుగు సంవత్సరాలు కష్టపడి పెంచితే తర్వాత సంవత్సరం నుంచి ఆదాయం వస్తుందన్నారు. ఆయిల్‌పామ్ పంటలకు వాడే డ్రిప్ ఇరిగేషన్ సేల్స్ ట్యాక్స్‌ను రద్దు చేయాలని కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేసినట్లు తెలిపారు. ప్రస్తుతం 30 లక్షల ఆయిల్ పామ్ మొక్కలు ఉన్నాయని, ఇప్పుడున్న రూ.1000 కోట్ల టర్నోవర్‌ను సంవత్సరంలో రూ.2వేల కోట్లకు చేర్చేందుకు కృషి చేస్తామన్నారు. రైతులకు రూ.2లక్షల రుణమాఫీని తప్పకుండా చేస్తామని అన్నారు.



| | | |
|---|---|---|
| | DATE STATUS | READING |
| Present | 14-07-2024 01 | 6445 |
| Previous | 11-06-2024 01 | 6083 |
| KWH UNITS: 362 | Days | 33 |
| Average Month Units | | 329.09 |
| Recorded MD | | 01.34 KW |
| ENERGY CHARGES | | 3445.80 |
| FIXED CHARGES | | 140.00 |
| CUSTOMER CHARGES | | 120.00 |
| Electricity Duty | | 21.72 |
| INTEREST ON ED | | 0.47 |
| SURCHARGE | | 150.00 |
| ACD SubCharge | | 0.00 |
| INT. ON CD | | 0.00 |
| ADJUSTMENT | | -0.00 |
| FSA | | 0.00 |
| Loss/Gain | | 0.01 |
| BILL AMOUNT | | 3878.00 |
| Arrears | | |
| As on 31-03-24 | | 0.00 |
| After 01-04-24 | | 39153.00 |
| TOTAL DUE | | 43031.00 |

## కరెంటు బిల్లు రూ.43వేలా?

**వినియోగదారుడు షాక్**

కొడకండ్ల, జూలై 14: ఓ వినియోగదారుడు అతడికి వచ్చిన కరెంటు బిల్లును చూసి షాక్ అయ్యాడు. ఏనాడూ ఇంత బిల్లు రాలేదని వాపోయాడు. జనగామ జిల్లా కొడకండ్ల మండలం గిర్నితండాకు చెందిన ధరావత్ కీమానాయక్ తన కుమారుడు మధునాయక్ పేరుతో కరెంటు మీటరు తీసుకొని వినియోగిస్తున్నాడు. స్థానికంగా ఓ వైన్స్ పక్కన పర్మిట్ రూమ్ కావడంతో ప్రతి నెలా రూ.3వేల నుంచి రూ.4వేల మధ్యలో కరెంటు బిల్ వచ్చేది. కానీ, ఈ నెల మాత్రం రూ.43,031 రావడంతో ఖంగుతిన్నాడు. వెంటనే అధికారులను అడగగా విచారణ చేస్తామని చెప్పినట్లు తెలిపాడు.

**అధికారుల నిర్లక్ష్యంతో ప్రభుత్వ ఖజానాకు గండి**

## సర్కారుకు అమ్మినా భూ రికార్డుల్లో పాత పేర్లే

- కోట అభివృద్ధికి రైతుల నుంచి భూముల కొనుగోలు
- విక్రయించిన భూములకూ రైతుబంధు
- కుడా, రెవెన్యూ అధికారుల సమన్వయలోపమే కారణం

ఖిలావరంగల్, జూలై 14 : కోట అభివృద్ధికి భూమిని సేకరించి రైతులకు డబ్బులు ముట్టజెప్పి ఏళ్లు గడుస్తున్నా రికార్డుల్లో మాత్రం పేర్లు మార్చడం లేదు. ఫలితంగా ఈ భూములకు రైతుబంధు పడుతుండగా, మరి కొంతమంది పంటరుణాలు పొందారు. మరొకరైతే ఏకంగా అమ్మిన భూమినే ఫ్యామిలీ మెంబర్ సర్టిఫికెట్ చేయించి పట్టా మార్పిడి చేయించుకున్నారు. అధికారుల సమన్వయ లోపం, నిర్లక్ష్యం వల్ల ప్రభుత్వ ఖజానాకు గండిపడుతోంది. రైతు భరోసా, ప్రభుత్వ భూముల పరిరక్షణ అంటూ గొప్ప గొప్ప మాటలు చెబుతున్న కాంగ్రెస్ ప్రభుత్వ తీరుపై సర్వత్రా విమర్శలు వెల్లువెత్తున్నాయి. ఖిలావరంగల్ మధ్యకోటలోని ఏకశిల చిల్డ్రన్స్ పార్కును కాకతీయ పట్టణాభివృద్ధి సంస్థ (కుడా) నిర్మించింది. పార్క్ పరిరక్షణతో పాటు గుండు చెరువు పరిసర ప్రాంతాల సుందరీకరణ, అభివృద్ధి కోసం భూసేకరణ చేపట్టాలని ప్రభుత్వాన్ని కోరింది. దీంతో గుండు చెరువు చుట్టూ, ఏకశిల పార్కు పరిసర ప్రాంతాల్లోని రైతుల భూములు 29.29 ఎకరాలు ప్రభుత్వం కొనుగోలు చేసి కుడాకు అప్పగించింది. కుడా అధికారులు చుట్టూ ప్రహరీ నిర్మించి తమ ఆధీనంలోకి తీసుకున్నారు. అయితే 2018లో ఎకరానికి రూ.22 లక్షలు చెల్లించిన అధికారులు భూ రికార్డులు మార్చకుండా తాత్సారం చేస్తూ వచ్చారు. 2019 నుంచి భూములు అమ్మిన రైతుల ఖాతాలో రైతుబంధు జమవుతోంది. మరికొంత మంది రైతులు పట్టా పాస్ బుక్‌ను పెట్టి పంట రుణాలు కూడా తీసుకున్నారని ప్రచారం జరుగుతోంది. అలాగే మార్టిగేజ్ రుణాల కోసం ప్రయత్నాలు జరుగుతున్నట్లు తెలిసింది. అలాగే సర్వే నంబర్ 85లో 2.3 ఎకరాల భూమి ఇంకా దేనబోయిన సందయ్య పేరుపైనే రికార్డులో ఉంది. ఆయన ఇటీవల మృతిచెందగా, కుటుంబ సభ్యులు అతడి భార్య యాదమ్మ పేరుపై ఖిలావరంగల్ తహసీల్దార్ కార్యాలయంలో పట్టా చేయించుకున్నారు.



కోటలో ప్రభుత్వం కొనుగోలు చేసిన భూముల మ్యాప్

**అధికారుల సమన్వయ లోపం..**

ప్రభుత్వం కొనుగోలు చేసిన సంబంధిత భూమి సర్వే నంబర్లలో అధికారులు పేర్లు మార్పిడి చేయకుండా చోద్యం చూస్తున్నారనే ప్రచారం జరుగుతోంది. ప్రభుత్వానికి అమ్మిన భూమిని మరొకరి పేరుతో రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తులపై ఇప్పటి వరకు చర్యలు తీసుకోకపోవడంపై పలు అనుమానాలకు దారితీస్తోంది. అధికారుల అండదండలతోనే రిజిస్ట్రేషన్ పూర్తయిందనే ఆరోపణలు కూడా ఉన్నాయి. రైతుల పేర్లపై ఉన్న భూరికార్డులను మార్చాలని రెవెన్యూ అధికారులకు లిఖిత పూర్వకంగా ఇచ్చామని కుడా అధికారులు అంటుండగా, తమకు సంబంధం లేదని, కుడా అధికారుల నిర్లక్ష్యం వల్లే రికార్డుల్లో పేరు మారలేదని రెవెన్యూ శాఖ అధికారులు పరస్పరం ఒకరిపై ఒకరు ఆరోపణలు చేసుకుంటున్నారు. స్లాట్ బుక్ అయింది కాబట్టే రిజిస్ట్రేషన్ చేశామని రెవెన్యూ అధికారులు పేర్కొంటున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు స్పందించి భూ రికార్డులలో పేర్లు మార్చాలని, ఇతరుల పేర్లపై రిజిస్ట్రేషన్ చేయించుకున్న వ్యక్తులపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

## లక్నవరంలో సండే సందడి





బ్రిడ్జిపై పెద్ద సంఖ్యలో పర్యాటకులు

గోవిందరావుపేట, జూలై 14: లక్నవరం సరస్సు వద్ద ఆదివారం పర్యాటకుల సందడి నెలకొంది. సెలవు కావడంతో పలు ప్రాంతాల నుంచి పర్యాటకులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. సరస్సులో సరిపడా నీరు లేకపోవడంతో బోటు షికారును అధికారులు నిలిపివేశారు. దీంతో లక్నవరం వచ్చిన పర్యాటకులు నిరాశతో వెనుదిరిగి వెళ్లిపోయారు.